



విరిసిన ఉత్సాహం కడియం పల్ల వెంకన్న నర్సరీలో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన మొక్కల అమరిక

నేతన్న నేస్తం అందేదెన్నడో?

- ఎదురు చూస్తున్న కార్మికులు
- 'చేనేత'కు కొరవడిన సర్కారు సహకారం
- అమలుకు నోచుకోని హామీలు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మగ్గాలను నమ్ముకుని జీవిస్తున్న వారికి గత వైసిపి ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పేరుతో ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందించింది. నేతన్న నేస్తం ఆర్థిక సాయం ముడి సరుకు, ఇతర అవసరాలకు ఉపయోగించుకునేవిధంగా అండగా నిలిచింది. అయితే 2023 జులైలో ఆ ప్రభుత్వం చివరి సారిగా సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలు చేస్తారో లేదో స్పష్టత లేకుండా పోయింది. 7 నెలలు గడుస్తున్నా నేతన్న నేస్తం అమలుపై సర్కారు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం అందించే సాయం కోసం చేనేత కార్మికులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని యు.కొత్తపల్లి మండలంలోని అమీనాబాద్, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, దుళ్ల, కడియం మండలం వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపై ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయ్యాయి. మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారుల లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి.

ఎప్పుడిస్తారో..?

నష్టమైనా, కష్టమైనా చేనేతనే నమ్ముకుని అనేక మంది కార్మికులు కాస్తో కూస్తో కుటుంబాలను పోషించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరి సారిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లగా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. ఉదాహరణకు పడుగు ధర రెండేళ్లతో పోల్చుకుంటే రెట్టింపు అయింది. కిలో పడుగు ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలకు పెరిగింది. నేతకు ఉపయోగించే ముడి సరుకు ధరలు విపరీతంగా పెరగడంతో గణనీయంగా ఉపాధి తగ్గిపోయిందని నేత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు కొందరికే దక్కుతుండడంతో మిగిలిన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి పూర్తి స్థాయిలో కార్మికులకు అందజేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

హామీలు అమలెప్పుడు..?

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ నేతలు నేతన్న కుటుంబాలకు వరాల జల్లులు కురిపించారు. అనేక హామీలు ఇచ్చారు. వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన నారా లోకేష్ చేనేత కుటుంబాలకి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూతనందిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వారాహి యాత్ర సందర్భంగా పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు మండలం చేబ్రోలులో చేనేత కుటుంబాలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేనేతను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నప్పటికీ గత ప్రభుత్వ అమలు చేసిన నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నేతన్న కుటుంబాల పరంగా ప్రభుత్వం ఒక్క నిర్ణయాన్ని కూడా తీసుకున్న పరిస్థితి లేదు. ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని చేనేత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సాయం లేక, నమ్ముకున్న చేనేత వృత్తి వదలలేక, వచ్చే నష్టాలను భరించలేక.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని ఆయా కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని నేత కార్మికులు కోరుతున్నారు.

సాయం అందించాలి

గత సర్కారు నేతన్న నేస్తం పేరుసాయం అందించేది. ఆ మొత్తాన్ని ముడి సరుకు ఇతర అవసరాలకు వాడుకునేందుకు ఉపయోగ పడేదని. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం కూడా సాయం అందిస్తానని చెప్పింది. కాని నేటికీ ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. వెంటనే సాయం అందించి నేతన్నలను ఆదుకోవాలి. హామీలను అమలు చేయాలి.

- ఎస్. నారాయణరావు, యు.కొత్తపల్లి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

అట్రాసిటీ బాధితులకు సత్వర పరిహారం

ప్రజాశక్తి - కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి సామాజికవర్గాలపై జరిగిన ఆరాచకాలు, అకృత్యాలకు సంబంధించి నమోదు అయిన అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర పరిహారం, న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు, ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడచిన మూడేళ్లలో నమోదైన అట్రాసిటీ కేసులు, వాటి ఇన్వెస్టిగేషన్ పురోగతి, బాధితులకు ఆర్థిక సహాయం పంపిణీ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 53 అట్రాసిటీ కేసులు విచారణలో ఉండగా, కాకినాడ డివిజన్ పరిధిలో 26, పెద్దాపురం డివిజన్ పరిధిలో 27 ఉన్నాయన్నారు. వీటిలో కుల ధృవీకరణ పత్రం, లీగల్ ఒపీనియన్, నిందితుల అరెస్టు, కోర్టు కోరిన వివరాలు, స్టే ఆర్డర్లు వంటి అంశాలతో పెండింగ్ ఉన్న అంశాలపై పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి కేసులన్నింటిపై జనవరి 10 నాటికి విచారణ పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. నూతన ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ ఏర్పాటయ్యే లోపు పెండింగ్ కేసులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో మొత్తం 186 అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రిలీఫ్ చెల్లించాల్సి ఉండగా 128 కేసుల బాధితులకు ఈ సహాయం అందించడం జరిగిందని, మిగిలిన 29 కేసులకు కూడా సత్వర పరిహారం అందేటట్టు తహశీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జిల్లా అధికారులందరూ తమ తమ శాఖలకు సంబంధించిన ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై ఏర్పాటైన ఏక సభ్య కమిషన్ ఇటీవల జిల్లాలో పర్యటించిన సందర్భంగా కోరిన ఉపకులాల వారీ సమాచారంపై నివేదికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, డిఆర్‌ఒ జె.వెంకట్రావు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జె.శ్రీనివాసరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, ఎపిపి జి.విజయ, శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ నూతన సంవత్సరం శుభాకాంక్షలు



ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా ప్రజలకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరో నవ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభవేళ జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లువిరియాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో ప్రజలు వర్ధిల్లాలని అన్నారు. కాకినాడ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచేందుకు ప్రభుత్వ కృషి చేస్తుందని, ఇందుకు తగిన ప్రణాళికతో అధికార యంత్రాంగం అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లా ప్రజలంతా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

శ్మశాన వాటిక స్థలాన్ని అప్పగించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని వాకతిప్ప గ్రామంలో కబ్జాకు గురియైన ఎస్‌సి శ్మశాన వాటిక స్థలాన్ని తిరిగి ఎస్‌సిలకు అప్పగించాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ ఎస్‌సిలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాకతిప్ప ఎస్‌సి పేటలో సర్వేనెంబర్ 95లో 12 సెంట్లు భూమిలో శ్మశాన వాటిక ఉండేదని అన్నారు. పూర్వీకుల నుంచి ఆ స్థలంలోని అంత్యక్రియలు నిర్వహించే వారిని తెలిపారు. అయితే కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేశారని అన్నారు. ఆక్రమించిన శ్మశాన వాటిక స్థలాన్ని అప్పగించకపోతే నిరాహార దీక్ష చేసేందుకు వెనకడుగు వేసేది లేదన్నారు. అనంతరం తహశీల్దార్ జి.చిన్నారావుకు వినతిపత్రం అందించారు. దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి రెవెన్యూ అడంగల్‌లో శ్మశాన స్థలమని ఉంటే తక్షణమే దళితుల శ్మశానానికి అప్పగించడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుర్రాల అప్పారావు, నాయ కులు కె.నాగేశ్వరరావు, అరంగ వాసు, సుబ్రహ్మణ్యం, చంద్రబాబు, శ్రీను, సాంబశివ, చిన్ని పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలపై నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడివేడీగా జరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలులో ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం వివిధ సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రంగప్ప చెరువు, రాజు చెరువుల వివాదం కోర్టు పరిధిలో ఉందని, వాటికి సంబంధించిన అంశాలను అజెండాలోకి ఎందుకు తెచ్చారని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. కౌన్సిలర్లు మైనం గంగాభవాని, గుల్ల సుబ్బారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందరని, జగనన్న కాలనీలో మరీదారుణంగా ఉందన్నారు. ట్యాంకుల ద్వారా కూడా నీటిని సరఫరా చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నగర పంచాయతీలోని ఆయా వార్డుల్లో రహదారులు అధ్వానంగా మారాయని, సిసి రోడ్లు, డ్రెయినేజీలు వేయాలని, సూరంపేటకు వెళ్లే మార్గంలో అవసరమైన వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. కమిషనర్ టి.రవి కుమార్ మాట్లాడుతూ సభ్యులు సూచన మేరకు రంగప్ప, రాజు చెరువులకు సంబంధించిన లీజు వ్యవహారాన్ని అజెండా నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మేనేజర్ నవీన్ అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్లు గ్రంథం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యరాణి, కౌన్సిలర్లు గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, లింగం సంధ్య, గంట అప్పలస్వామి, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పోలీస్‌స్టేషన్‌లో ఈశ్వరరావు నిర్బంధం

పోలీసుల తీరుపై సిపిఎం, సిఐటియు ఖండన

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ అర్ధాంతరంగా మూసేయడంతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఈ నేపథ్యంలో కార్మికుల పక్షాన సిఐటియు నిలబడి 46 రోజులుగా పోరాటం చేస్తుంది. చేస్తూ వస్తుంది. కార్మికుల తరపున పోరాడుతున్న సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన తెలిపారు. కార్యాలయం సిబ్బందిని లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్మికులను పక్కకు నెట్టి, సిబ్బందిని లోనికి పంపించారు. ఈ నేపథ్యంలో సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావును ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకూ స్టేషన్‌లోనే నిర్బంధించారు. దీనిపై సిఐటియు, సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు.

విఆర్‌ఒల సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రౌతులపూడి

విఆర్‌ఒల సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. సంఘం అధ్యక్షులుగా అనపర్తి నాగేశ్వరరావు, కార్యదర్శిగా పారుపాక విఆర్‌ఒ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సత్యవేణి, కోశాధికారిగా చంటియ్య, ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అభినందించారు.

మండల ఇంజినీరింగ్ అధికారి ఉద్యోగ విరమణ

పెదపూడి : మండల ఇంజినీరింగ్ అధికారి కడలి ఉమామహేశ్వరస్వామి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ నరేంద్రరెడ్డి ఉమామహేశ్వర్రావు దంపతులను పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి సత్కరించారు. మూడేళ్లుగా తన సేవలతో ఉమామహేశ్వరరావు అందరి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎంఎస్‌ఎన్.రెడ్డి, ఎఒ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ బెనర్జీ, ఎపిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

బుల్లిప్రసాద్ సేవలు అభినందనీయం

పిఠాపురం : పట్టణంలోని ఆర్‌ఆర్‌బిజెకెఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 22 ఏళ్లపాటు తెలుగు అధ్యాపకునిగా పనిచేసిన వీరమల్లి బుల్లిప్రసాద్ సేవలు అభినందనీయమని ప్రిన్సిపల్ కేశవరావు అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ సందర్భంగా బుల్లి ప్రసాద్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు, చక్కటి ప్రవర్తన నేర్పేవారన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కాశీ విశ్వనాథం, సుందరయ్య, లక్ష్మీ నారాయణ, సత్యనారాణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ పుట్టినరోజు

గండేపల్లి : గండేపల్లిలో టిడిపి యువ నాయకుడు సుంకవల్లి రమేష్ పుట్టినరోజును పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎలమాటి కాశి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో వెంపటి రాజు, రెడ్డి సుబ్బారావు, వేంపాటి సతీష్, పసుమర్తి సుబ్రహ్మణ్యం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల సర్వే సక్రమంగా నిర్వహించాలి

సామర్లకోట : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు వల్లూరి నాని కోరారు. మంగళవారం తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో మాదిగ కులస్తులను మాలలుగా చూపిస్తూ సర్వేను తప్పుగా నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు లోకేష్, ఎం.రాజు ఎం.వెంకన్న ఎం.రాజ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా నారాయణమూర్తి పుట్టిన రోజు

రౌతులపూడి : సినీహీరో, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి పుట్టిన రోజు వేడుకలను జన్మదిన వేడుకలను మంగళవారం బుల్లిఅబ్బాయి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. మార్కెట్ సెంటర్‌లో ఆంజనేయస్వామి గుడి వద్ద సూర్ల శ్రీను తదితరులు నారాయణమూర్తి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రౌతులపూడి మండలవ్యాప్తంగా ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనియాడారు.

ప్రజల కోసం పనిచేసే పత్రిక 'ప్రజాశక్తి'

క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంఎల్‌ఎ సత్య ప్రభ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజల కోసం పనిచేసే పత్రిక ప్రజాశక్తి అని ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడులోని ఎంఎల్‌ఎ నివాసంలో ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఆమె మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పత్రికలు నైతిక విలువలు పాటించాలన్నారు. ప్రజల సమస్యలను వెలికితీస్తూ ప్రజాప్రతినిధులకు అధికారులకు తెలియజేసేలా పత్రికలు పనిచేయాలన్నారు. నేటి సమాజంలో పత్రికలు పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యాళ్ల జగదీష్, యువ నాయకుడు చక్కపల్లి నవీన్, సుంకర సోమరాజు, ప్రజాశక్తి విలేకరి శిగిరెడ్డి రమేష్, తుని డివిజన్ ఆర్గనైజర్ డి.ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ, ఇతరులు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి


ప్రజాశక్తి - పిఠాపురం

న్యాయవాదుల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి స్థానిక కోర్టు బయట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, న్యాయవాది జల్లా సుదర్శన్ రెడ్డిపై అనంతపురం జిల్లా లక్కిరెడ్డిపల్లి సిఐ కొండారెడ్డి దురుసు ప్రవర్తనకు, అలాగే అనంతపురం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారులు సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని, న్యాయవాది వివి.శేషాద్రి వివరణను పట్టించుకోకుండా దురుసుగా వ్యవహరించడంతో న్యాయవాది ఒత్తిడికి లోనై గుండెపోటుకు గురై చనిపోవటం జరిగిందన్నారు. న్యాయవాది మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని, పోలీసులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎం.అలీ, ట్రెజరర్ గౌతు రాజా, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి గుదిమెళ్ళ భాస్కరాచార్యులు, న్యాయవాదులు బత్తిన లక్ష్మణ్‌దొర, కెవివి.వర్మ, అనిశెట్టి కాశీ విశ్వనాథరెడ్డి, కాలి విజయకుమార్, ఎం.సత్యవతి, అల్లాడి గీత, కొంగు నూకరాజు, ముమ్మిడి రామకృష్ణ, వేలంగి వెంకటేష్, మహేష్, పి.రవికుమార్, సిహెచ్.మనో పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

కార్టూ'నిజం'



అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

-వాడివేడిగా సామర్లకోట మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

అధికారుల తీరుపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వైస్‌చైర్మన్‌తో పాటు పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జీరో అవర్‌లో వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజేష్ సహా పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. ప్రజా సమస్యలపై అధికారులు పట్టనట్టు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వార్డుల్లో అభివద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. ఆ బిల్లులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ పనులపై అధికారులు స్పందించకుంటే వచ్చే కౌన్సిల్ సమావేశంలో బైటాయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, కాళ్ల శ్యామల, నేతల హరిబాబు, ఆవాల లక్ష్మీ నారాయణ, రెడ్నం సునీత, పాగా సురేష్, పిట్టా సత్యనారాయణ, తదితరులు మాట్లాడుతూ పెండింగ్ పనులపై మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. కొన్ని వార్డుల్లో అవసరం లేకున్నా రోడ్డుపై రోడ్డులు నిర్మిస్తున్నారని, అవసరమైన చోట కనీస మట్టిబాట కూడా ఉండ్లేదని ఆగ్రహం వ్యక్త చేశారు. కో-ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో మరణించిన అవుట్సోర్సింగ్ కార్మికుల కుటుంబ సభ్యులకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. వెంకట్ రామ ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి గోదావరి కాలువలో కలుస్తున్న కాలుష్య జలాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. తమ వార్డులో సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్ష దిగుతానని కౌన్సిలర్ రెడ్నం సునీత అధికారులను హెచ్చరించారు. పట్నంలో జరిగిన కాల్వల పూడిక తీత పనుల్లో అవకతవకలపై కమిటీ వేసి నిజ నిర్ధారణ చేపట్టాలని కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. అన్నా క్యాంటీన్ నిరుపయోగంగా ఉంటుందని కేవలం 50-60 మంది మాత్రమే దానిని ఉపయోగించుకుంటున్నారని కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ప్రతి రోజూ మధ్యాహ్నం 250 మంది, రాత్రి 250 మందికి పైగా భోజనం పెడుతున్నామన్నారు. భోజనం చేసేవారి ఫేస్ స్కానింగ్ యంత్రం కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల అధికారులు, అందరు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

జిల్లాలోని పలు కేంద్రాల్లో మంగళవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు పాల్గొని విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతలను వెలుగులోకి తెచ్చేందుకు ఈ ప్రదర్శనలు దోహదం చేస్తాయని అన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక లూథరన్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు ప్రారంభించారు. డివైఇఒ శర్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడుతూ దేశాభివృద్ధికి శాస్త్ర, సాంకేతిక రంగాలు కీలకమన్నారు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన విధానంతో సమాజ వికాసానికి పాటుపడాలన్నారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంపొందించుకుని సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మండల పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు 88 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ఎంఎల్‌ఎ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ విఆర్‌కె.చౌదరి, లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.ఫిలిప్ రాజు, కరస్పాండెంట్ నళిని, విద్యార్థులు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య పాల్గొని మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన


మాట్లాడుతున్న పెద్దాపురం ఎంఎల్‌ఎ చినరాజప్ప

జరిగిన ప్రదర్శనల్లో వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎందుకు, ఏమిటి, ఎలా? అనే ప్రశ్నలతో సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. స్వల్ప వ్యయంతోనే మంచి ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల పర్యావరణం, సైన్స్, గణితంపై ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంత గానో అలరించాయి. ప్రైవేటు స్కూల్ మేనేజ్‌మెంట్, ప్రభుత్వ పాఠశాలలకు వేర్వేరుగా ప్రాజెక్టులను ఎంపిక చేసి, ప్రథమ, ద్వితీయ స్థానాల పొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల సైన్స్ టీచర్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు. **కరప** మండలంలోని గురజానపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కెబి.కృష్ణవేణి పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి యాళ్ళ సుబ్బారావు, ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి, సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, ఎంఇఒ-2 పి.సత్య నారాయణ, ఎస్‌ఎంసి ఛైర్మన్ నూకరాజు, ఎంపిటిసి సభ్యులు వీరవేణి, హెచ్‌ఎంలు సాయిమోహన్, కాశీ విశ్వేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం జి.వేమవరం హైస్కూల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, స్థానిక సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపిటిసి సభ్యులు యర్రంరెడ్డి అప్పారావు, ఎంఇఒ మోకా ఉమ పాల్గొన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించిన ప్రదర్శనలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గండి అప్పారావు, అనిల్, పుణ్యమంతుల సత్తిబాబు, బూరిబాబు, ఉపాధ్యాయులు సత్తిరాజు, తంబి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** : విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని పెంపొందించడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని ఎంఇఒ నాయుడు వెంకటేశ్వరరావు, డి.శివప్రసాద్ తెలిపారు. ఈ మండల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం వారు ప్రారంభించారు. తొలిత సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మండల వ్యాప్తంగా సుమారు 15 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని 46 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థి విభాగం నుంచి చెందుర్తి ఎంపియుపి విద్యార్థి కెఅఖిలేష్, గ్రూపు విభాగంలో ఎకె.మల్లవరం జడ్‌హెచ్‌ఎస్ పాఠశాల, ఉపాధ్యాయ విభాగంలో చెందుర్తి ఎంపియుపి పాఠశాల విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎస్‌ఎంఎస్‌సి చైర్మన్ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అంతర జిల్లాలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారం, వెండి, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు అమలాపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్ కె.ప్రసాద్ తెలిపారు. ముమ్మిడివరం సిఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్‌పి ప్రసాద్ మాట్లాడుతూ ఐ పోలవరం మండలం వద్ది చెరువుకు చెందిన ఓలేటి మహేంద్రావు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్న మల్లం కు చెందిన గెద్దాడ సురేంద్ర, పశ్చిమగోదావరి జిల్లా తణుకు చెందిన పాట్నూ పోతుల ఉదయ్ కుమార్ లు అనుమానాస్పదంగా లక్ష్మీదేవి లంక వద్ద తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారన్నారు. ముమ్మిడివరం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, అయినవిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఏలూరు జిల్లా ద్వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, మొత్తం ఏడు కేసులకు సంబంధించిన నిందితుల నుంచి 277.1 గ్రాముల బంగారం, కేజీ 1.215 గ్రాముల వెండి, రెండు మోటార్ సైకిల్ పల్సర్, సుజుకి యాక్సెస్ , మూడు సెల్ ఫోన్లు మొత్తం విలువ రూ.23 లక్షల 30 వేల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితులు వ్యసనాలకు బానిసై ఈజీ మనీకి అలవాటు పడి ఈ దొంగతనాలు పాల్పడుతున్నారని డిఎస్‌పి వివరించారు. నిందితులను దుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి బంగారు వెండి వస్తువులు మోటార్ సైకిళు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి వివరించారు. చోరీ కేసును అత్యంత చాక చక్యంగా చేదించిన సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్, సిబ్బందిని ఎస్‌పి కృష్ణారావు ఈ సందర్భంగా అభినందించారు. ఈ సమావేశంలో ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ లు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారు బైక్ పై వెళ్తూ ప్రమాద వశాత్తు చెట్టుని ఢీ కొట్టి అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో పడి గల్లాంతయిన యువకుడి మృతదేహం గత నెల 30వతేదీ రాత్రి లభ్యమైంది. దీనికి సంబంధించి మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పలగుప్తం మండలం కామరాజుపేటకు చెందిన పెయ్యల స్టీఫిన్, ధోనిపాటి అభిషేక్(23) యానాం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ సమయంలో ప్రమాద వశాత్తు మురమళ్ల పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డులో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ప్రమాదవశాత్తూ అయినాపురం అవుట్ ఫాల్ స్లూయిజ్‌లో అభిషేక్ పడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా గత నెల 30న మృతదేహం లభ్యమయింది. ఈ ప్రమాదంలో మరో యువకుడు స్టీఫెన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు ఎస్ఐ డి జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అయినాపురం గ్రామానికి చెందిన వివాహిత మట్ట వీరవేణి (30) కుటుంబ కలహాలతో గత నెల 30వ తేదీ రాత్రి ఇంట్లో ఉరెసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సత్యనారాయణ గౌడ్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి నరేంద్ర పట్నంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వితంతు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని 16 మంది వితంతువులకు ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్, కూటమి నాయకులు మంగళవారం పింఛన్లు అందజేశారు. పటవల, తాళ్లరేవులో జరిగిన పంపిణీలో ఎంపిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పటవల సర్పంచ్ చినకామేశ్వరరావు, కూటమి నాయకులు నడింపల్లి వినోద్, భజన సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, వాకపల్లి చిరంజీవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లిలో టిడిపి యువ నాయకుడు సుంకవల్లి రమేష్ పుట్టినరోజును పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎలమాటి కాశి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో వెంపటి రాజు, రెడ్డి సుబ్బారావు, వేంపాటి సతీష్, పసుమర్తి సుబ్రహ్మణ్యం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యచక్రం సేవలు ఆదర్శనీయం

కాకినాడ : 2024 విద్యా సంవత్సరంలో ఒక్కరోజు సెలవును కూడా తీసుకోకుండా ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉపాధ్యాయుడు సూర్యచక్రం ఆదర్శప్రాయుడని ఎంఇఒలు కెవి.సత్యనారాయణ, చెవ్వూరి రవి కొనియాడారు. మంగళవారం కాకినాడ అర్బన్ మండలం గోగుదానయ్య పేట మునిసిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా 2024 విద్యా సంవత్సరంలో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్న సూర్యచక్రంను వారు పాఠశాలలో అభినందించారు. సూర్యచక్రం 2000 సంవత్సరంలో కాకినాడ మునిసిపాలిటీలో ఎస్‌జిటిగా ఉద్యోగ ప్రవేశం చేసి, 24 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారు. నాడు నేడు పనులలో పాఠశాలకు సమారు పది లక్షలు విలువైన పనులు అత్యంత సమర్ధవంతంగా పూర్తి చేశారు. పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సూర్యచక్రంకు అభినందనలు తెలిపారు.

నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా?

ప్రజాశక్తి - పిఠాపురం


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సంతాపం తెలుపుతున్న సభ్యులు

కూటమి ప్రభుత్వం అధికారంకొచ్చి ఏడు నెలల గడుస్తున్నా మున్సిపాలిటీ అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించలేదని పలువురు వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలోని మున్సిపాలిటీకి నిధులు లేవంటూ అధికారులు చెబుతున్నారన్నారు. ఇలా అయితే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధరణ సమావేశం చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగింది. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం సభ ప్రారంభమైంది. జనరల్ ఫండ్ కేటాయించిన పనులు పూర్తి కాకపోవడంపై కమిషనర్‌ను నిలదీశారు. గతంలో ర్యాటిఫికేషన్ చేయొద్దని చెప్పి, ఆ పనులు మళ్లీ అజెండాలోకి ఎలా తెచ్చారని కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరి, సోమరౌతు లలిత ప్రశ్నించారు. అత్యవసర పనులు కొన్నింటిని ఎజెండాలో చేర్చామని,త్వరలో రూ.2కోట్ల నిధుల విడుదలతో పాటూ, మూడు వార్డులకు సంబంధించిన రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కాంట్రాక్టర్ సూరవరపు దివాణాన్ని ఎందుకు బ్లాక్ లిస్టులో పెట్టలేదని నిలదీశారు. కమిషనర్ మాట్లాడుతూ ఆయనకు నోటీసులు ఇచ్చామని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ నుంచి లిఖిత పూర్వక సమాధానం స్వీకరించి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై ఇరువురికి వాగ్వాదం జరిగింది. మినిట్స్ బుక్స్‌లో అవకతవకలపై విచారణపై సభ్యులు ప్రస్తావించారు. ఆ ఉద్యోగికి ప్రస్తుతం బదిలీపై వేరే మున్సిపాల్టీకి వెళ్లారని త్వరలో పిలిపించి వివరణ తీసుకుంటానని కమిసణర్ తెలిపరాఉ. కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో సాధారణ నిధులు తప్పితే ఆయన మున్సిపాల్టీకి చేసిందేమి లేదని విమర్శించారు. 7 నెలలు గడుస్తున్న ఒక్కసారి కూడా ఉప ముఖ్యమంత్రి కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేదని వైసిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదాయ వనరుల పెంపుపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ ఆదాయ వనరుల పెంపుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చైర్ పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆకుల కష్ణ బాబుజి, త్సలికి సత్య భాస్కర రావు, పప్పుల దుర్గ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నా రన్నారు. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు వినాయకుని గుడిసెంటర్లో పాత షాపింగ్ కాంప్లెక్స్‌ను పడగొట్టేసిన స్థలంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ కడితే రూ.కోటికి పైగా ఆదాయం లభిం చేదన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో భాగ్యశ్రీ ప్రైవేటు గ్యాస్ కంపెనీ 52 కిలోమీటర్ల మేర గ్యాస్ పైపులైను కోసం తవ్వకాలు జరిపిందన్నారు. ఈ కంపెనీ నుంచి చలానా కట్టించాలన్నారు. అనధికార కులాయి కనెక్షన్లపై దృష్టి సారిస్తే మున్సిపాలిటీకి ఎంతో ఆదాయం లభించేదన్నారు. దీనిపై మున్సిపల్ చైర్ పర్సన్ తులసి మంగతాయారు స్పందిస్తూ ప్రభుత్వ స్థలాల రక్షణ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి , మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, డిఇఇ ప్రకాశరావు, ఎఇ కృష్ణజీవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాల్మన్‌రాజ్ సేవలు స్ఫూర్తిదాయకం

పజాశక్తి - జగ్గంపేట

మండలంలోని రాజపూడి జడ్‌పి ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ పదవీ విరమణ చేస్తున్న సాల్మన్‌రాజు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు కొని యాడారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో ఆయన పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉపాధ్యాయుడుగా ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన సాల్మన్‌రాజుకు వారు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎంవి.సాయిరాం మాట్లాడుతూ అనేక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఆయన అందరి మన్ననలను అందుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ ఏలేశ్వరం, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ఉపాధ్యాయుడుగా పని చేసి ప్రధానోపాధ్యాయులుగా రాజపూడికి వచ్చానని అన్నారు. తన సర్వీస్ 35 సంవత్సరాల 3 నెలలపాటు జరిగిందన్నారు. తనకి సహకరించిన ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇక నుంచి తన జీవితం ప్రజా సేవకి అంకితం చేస్తానన్నారు. అనంతరం ఎన్నో సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న మాస్టర్ కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజపూడి పాఠశాలకి ఆయన సొంత నిధులతో సౌండ్ బాక్స్‌ను బహుకరించారు. అనంతరం ఆయనను అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రేకా బులిరాజు, ఊయ్యూరి నాని, అచ్యుతరామయ్య, బుల్లబ్బు, ఎస్‌ఎంసి ఛైర్మన్ శ్రీను, యుటిఎఫ్ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయ, పాల్గొన్నారు.

కమిషనర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రజల సమస్యల పరిష్కారంలో కమిషనర్ టి.రవికుమార్ చేసిన సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. మంగళవారం కమిషనర్ పదవీవిరమణ కార్యక్రమాన్ని నగర పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ గండేటి మంగతాయారు, వైస్ ఛైర్మన్లు గంధం నాగేశ్వరావు, తెడ్లపు అలేఖ్యారాణి, కూటమి నాయకులు రవికుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజల పట్ల అంకితభావంతో పనిచేయాలని అన్నారు. అప్పుడే ఉద్యోగులకు గౌరవం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి - కాకినాడ

విద్యార్థుల ఉన్నతికి పాఠశాలల నిర్వహణా కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు కృషి చేయాలని డిఇఒ పిల్లి రమేష్ సూచించారు. మంగళవారం స్థానిక శాలిపేట మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో అర్బన్ మండలంలోనిపాఠశాల నిర్వహణా కమిటీల ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం లక్ష్యాన్ని, ప్రభుత్వ పాఠశాలలకు అందుబాటులో ఉన్న నిధులు, వనరులను ఉపయోగించుకుని అనుభవం కలిగి ఉన్న ఉపాధ్యాయులను ఉపయోగించుకుని విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలన్నారు. శిక్షణ పొందుతున్న పాఠశాల నిర్వహణ కమిటి అధ్యక్షుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. జనవరి 4వ తేదీన పాఠశాల స్థాయిలో పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంఇఒలు కెవి.సత్యనారాయణ, చెవ్వూరి రవి తెలిపారు. సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.వేణుగోపాలరావు, సిఎంఒ చామర్తి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ అడబాల తేజశ్రీ, పెనుమళ్ళ వెంకటశివ, కొల్లు ప్రసన్నకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

గండేపల్లి మండలంలో 8406 మంది పింఛన్‌దారులకు మంగళవారం తెల్లవారు జాము నుంచే అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా 95.50 శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నాతి బుజ్జి తెలిపారు. ఇదిలావుంటే నీలాద్రిపేటలో విఆర్ఒ సమయానికి రాకపోవడంతో పింఛన్‌దారులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. **కరప** మండలంలోని 23 గ్రామాల్లోని సుమారు 93 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని 16 మంది వితంతువులకు ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సాగర్, కూటమి నాయకులు మంగళవారం పింఛన్లు అందజేశారు. పటవల, తాళ్లరేవులో జరిగిన పంపిణీలో ఎంపిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పటవల సర్పంచ్ చినకామేశ్వరరావు, కూటమి నాయకులు నడింపల్లి వినోద్, భజన సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, వాకపల్లి చిరంజీవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

గొల్లప్రోలు : ప్రభుత్వ జూనియర్ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం జూనియర్ కాలేజీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందరికీ విద్య ఉపాధి అవకాశాల కోసం పోరాడుతుందన్నారు. కళాశాలకు సొంత భవనం నిర్మించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత కళాశాల ఆవరణలోఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు వర్షిని కార్యదర్శి వడ్డికాసులు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ పిఠాపురం నాయకులు సిద్ధు లోవరాజు మాట్లాడుతూ సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు బిందు, హేమ, పావని, గాయత్రి, సాయిప్రసాద్, స్వామి, దుర్గ, ప్రసన్న, శివ జ్యోతి, వివి.రమణ పాల్గొన్నారు.

గణిత చదరంతో న్యూఇయర్‌కు స్వాగతం

ప్రజాశక్తి - సామర్లకోట

న్యూ ఇయర్ గణిత చదరం

514	498	509	504
508	505	513	499
502	507	500	516
501	515	503	506

ప్రముఖ గణిత అవధాని తోటకూర సాయిరామకృష్ణ 2025 నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా గణిత చదరం ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మ్యాజిక్ చదరంలో ఏ నాలుగు నిలువ వరుసల్లోని సంఖ్యల మొత్తమైన 2025, ఏ నాలుగు అడ్డువరుసల్లో సంఖ్యల మొత్తం అయినా 2025 వస్తుంది. కర్ణాల వెంబడి నాలుగు సంఖ్యల మొత్తం అయినా 2025 రాగా, పైన, కింది ఏ రెండు చిన్ని చదరాల్లో సంఖ్యల మొత్తం అయిన 2025 వస్తుందని, మధ్య నున్న చిన్ని చదరంలో నాలుగు సంఖ్యల మొత్తం 2025 అవుతుందని, ఒకే రంగుతో సూచించిన నాలుగు సంఖ్యల మొత్తం అయినా 2025 వస్తుందని, ఇలా మరెన్నో రకాలుగా నాలుగు సంఖ్యల మొత్తం 2025 రావడం, వాడిన సంఖ్య వాడక పోవడం గమనించ వచ్చు.

కొత్త ఆలోచనలతో స్వాగతం పలకండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరు నూతన ఆలోచనలతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఎస్ఐ మౌనిక అన్నారు. మంగళవారం జన విజ్ఞాన వేదిక, చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఎస్ఐ మాట్లాడారు. న్యూఇయర్ వేడుకల్లో మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రవివర్మ, చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి అరుణ్‌కుమార్, ప్రజానాట్య మండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, ఆర్.వీర్రాజు, మిషన్ అన్నపూర్ణ సహాయనిధి పౌండర్ దేవత రాజేష్‌కుమార్, మంజుల, అమృత, నమ్రత, హాసిని, కూనిరెడ్డి పవన్, ధర్మ, బంగారు రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

2 నుంచి పోలీసుల ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో సాంప్రదాయ క్రీడోత్సవాలను ఈ నెల 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాలకు చెందిన గ్రామీణ యువతతో క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జనవరి 2 నుంచి 7 వరకూ ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. గ్రామీణ యువతను జూదాల వైపుకు మళ్ళ కుండా చూచే లక్ష్యంతో గ్రామీణ క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సీనియర్ కబడ్డీ (పురుషులు) 25ఏళ్ల లోపు ఉండాలని, జూనియర్ కబడ్డీ (పురుషులు): 18 ఏళ్ల లోపు ఉండాలని, వాలీబాల్ (పురుషులు) 25 ఏళ్ల లోపు వరకూ, వాలీబాల్ (మహిళలు) 25 ఏళ్లల్లోపు ఉండాలన్నారు. కబడ్డీ (మహిళలు): 25 ఏళ్లలోపు వారు ఉండాలన్నారు. ముగ్గులు పోటీలు, త్రో బాల్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ పోటీల్లో మహిళలు పాల్గొనొచ్చన్నారు.

యానాం వార్తలు

ఘనంగా యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం

యానాం యూత్ క్రిస్మస్ వేడుకలు స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా జరిగింది. యానాం క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు.ఈ వేడుకల్లో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొని క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం క్రిస్మస్ కేకును ప్రతినిధులతో కలిసి కట్ చేశారు. ఇవాంజలిస్ట్ మారెళ్ల స్టీవెన్, తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నాగూర్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - యానాం

యానాం పోలీస్ శాఖలో స్పెషల్ గ్రేడ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఎలుగోటి నాగూర్ సేవలు ప్రశంసనీయమైనవని ఎస్‌పి రాజశేఖరన్ అన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ బీచ్ పరిధిలో వెంకరత్నం నగర్లో నాగూర్ దంపతులను పోలీస్ శాఖ, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ గార్డు నుంచి కానిస్టేబుల్, హెచ్‌సి, ఎఎస్ఐగా వివిధ హోదాల్లో సుమారు 36 ఏళ్లపాటు క్రమశిక్షణతో సేవలు అందించారని అన్నారు. భవిష్యత్ జీవితం ఆనందమయంగా సాగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పలువురు నాగూర్, మీరాబీ దంపతులను దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, కానిస్టేబుల్స్, హోమ్ గార్డులు పాల్గోన్నారు.

కవి దాట్లకు స్మారక అవార్డు

ప్రజాశక్తి - యానాం

యానాంకు చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తటవర్తి భారతి స్మారక పురస్కారం అందుకున్నారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయం సమావేశ మందిరంలో మేడా మస్తాన్ రెడ్డి బృందం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సభలో దాట్లకు జెఎస్ఎన్.రాజు, బాల మోహన్‌దాస్, బేతవోలు రామబ్రహ్మం, నాగేశ్వరరావుల చేతుల మీదుగా పురస్కారంను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా దాట్లను ఘనంగా సత్కరించి నగదు, మెమెంటో అందించి అభినందించారు.

ఈశ్వరరావు అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - పిఠాపురం, పెద్దాపురం

సిఐటియు ఏలేశ్వరం నాయకులు ఆర్.ఈశ్వరరావును పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని పిఠాపురం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు కరణం విశ్వనాథం, కె చిన్న మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. సుమారు 46 రోజులుగా ఏలేశ్వరం మండలం చిన్నంపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతోనే తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించి ధర్నా చేపట్టారని తెలిపారు. కార్మికులకు అండగా ఉన్న సిఐటియు నాయకుడు ఈశ్వరరావును పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్ట్ చేసిన ఈశ్వర్ రావును తక్షణం భేషరతుగా విడుదల చేయాలని సిఐటియు పెద్దాపురం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, దాడి బేబీ మాట్లాడారు. చర్చలు పేరుతో పిలిచి అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

శ్రీ ప్రకాష్‌లో ఎన్ఇపిపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు

స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో జాతీయ విద్యా విధానం-20(ఎన్ఇపి)పై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో విపిఎం అకాడమీ అఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యూకేషన్ రీసెర్చ్ ప్రొఫెసర్ సుధాకర్ సి.అగార్కర్ పాల్గొని మాట్లాడారు. సంపూర్ణ మానవ సామర్థ్యాన్ని సాధించేందుకు, నిష్పాక్షికమైన, న్యాయ బద్ధమైన సమాజాన్ని స్థాపించేందుకు జాతీయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు విద్యే మౌలికమైనదని అన్నారు. విద్యా వ్యవస్థ మౌలిక సంస్కరణల్లో ఉపాధ్యాయుడు తప్పనిసరిగా కేంద్ర బిందువుగా ఉండాలని, అన్ని స్థాయిల్లో చురుకుతనం, తెలివి కలిగిన వారు భోదన వృత్తిలో ప్రవేశించే విధంగా వారి జీవనోపాధి, గౌరవం, స్వయం ప్రతిపత్తి లకు భరోసా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎఆర్‌కె.రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, పాల్గొన్నారు.

సిపిఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర ప్రజలకు సిపిఎం నగర కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని సిపిఎం ఆకాంక్షిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలని, నిత్యావసర సరుకుల ధరలు అదుపులో ఉంచాలని, యువతకు ఉపాధి కల్పించాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. 2025లో అయినా కాకినాడ నగర పాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించి ప్రజాపాలన సాగించాలన్నారు.

మద్యం లేని న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యం లేని నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని డాక్టర్ సిహెచ్.వరలక్ష్మి అన్నారు. మంగళవారం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వరలక్ష్మి హాస్పిటల్‌లో డాక్టర్ సిహెచ్.వరలక్ష్మి చేతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, మాదకద్రవ్యాలు రహిత నూతన సంవత్సర వేడుకలు అందరూ జరుపుకోవాలని అన్నారు. మద్యం రహిత సమాజ స్థాపనలో యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, కరణం శ్రీనివాస్, అడ్వకేట్ ఆర్‌వి.రమణారావు, విశ్వనాథ్, ల్యాబ్ శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక నాయకులు సిహెచ్.పావని , సిహెచ్.సతీష్, తదితరులు పాల్గొన్నారు.